


# సమస్యల్లో పుట్టి... సందేహాల్లో మిగిలి...

ఒక చారిత్రకఘట్టాన్ని మనం ఏవిధంగా చూస్తామనేది మనం దానినుండి ఏం ఆశించామనేదాని మీద ఆధారపడివుంటుంది. ఈ శతాబ్దపు చరిత్రలో ఒక వెలుగు వెలిగి ప్రస్తుతం ఆరిపోయివున్న కమ్యూనిస్టు ప్రయోగానికి కూడా ఇది వర్తిస్తుంది.

పెట్టుబడిదారీ వ్యవస్థనూ,అది మానవజాతికి అందిచ్చే జీవన విధానాన్నీ విలువలనూ పట్టుదలగా వ్యతిరేకించిన శక్తిగా కమ్యూనిస్టు ప్రయోగాన్ని అర్థం చేసుకున్నట్టయితే దాని జయాపజయాలు ఒక రకంగా కనిపిస్తాయి. సమత మీద, పరస్పర సహకారం మీద ఆధారపడిన నూతన సమాజాన్ని నిర్మించే ప్రయోగంగా అర్థం చేసుకున్నట్టయితే వేరేరకంగా కనిపిస్తాయి. రెండోకోణం నుండి చూసినప్పుడు కమ్యూనిస్టు ప్రయోగంలో వైఫల్యమే ప్రధాన విషయంగా కనిపిస్తుంది. సమత, సహకారాల ప్రాతిపదికన మానవ జీవితాన్ని పునర్నిర్మించడానికి ఏం చేయాలన్న జ్ఞానం కొంత అది ఇచ్చిందిగానీ అంతకంటే ఎక్కువగా ఏం చేయకూడదన్న జ్ఞానమే ఇచ్చింది.అది కూడా జ్ఞానమే కాబట్టి అందుకు సంతోషిద్దామంటే అభ్యంతరం లేదు. కానీ మొదటి కోణం నుండి చూసినప్పుడు కమ్యూనిస్టు ప్రయోగం గొప్పమేలు చేసిందనే చెప్పుకోవాలి. విపరీతమైన అహంకారంతో ప్రపంచాన్ని మొత్తం తన పెత్తనానికి లోబరచుకోవడానికి దూకుడుగా ఈ రోజు ముందుకొస్తున్న అంతర్జాతీయ పెట్టుబడిదారీవిధానానికి అడ్డుకట్ట వేయడానికి ఒక సోవియట్ రష్యా అయినా లేకుండా పోయిందే అని సోషలిజాన్ని కాంక్షించేవాళ్లు అనుకోకుండా ఉండలేరు. కమ్యూనిస్టు ప్రయోగమే జరగకుండా ఉండివుంటే ఈ శతాబ్దంలో కార్మికులు, ఇతర పీడిత ప్రజలు, బడుగు దేశాల పరిస్థితి చాలా దయనీయంగా ఉండేదని గడచిన పదిసంవత్సరాల కాలంలో మన కళ్లముందు రూపం తీసుకున్న పరిస్థితులు స్పష్టం చేస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు ఉద్యమానికి వర్తించే ఈ వ్యాఖ్యలు మన రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రకు కూడా వర్తిస్తాయి. ఒకకోణం నుంచి కొంచెం ఎక్కువే వర్తిస్తాయి. నూతన సమాజ నిర్మాణం ఏవిధంగా జరగ్గలదన్న జ్ఞానాన్ని అందియ్యడంలో మొత్తంగానే కమ్యూనిస్టు ఉద్యమం విఫలమైనా, ఇతర దేశాలలో కొన్ని కొత్త ఆలోచనలను ప్రతిపాదించి ప్రయోగానికి పెట్టిన కమ్యూనిస్టు నాయకులూ, సిద్ధాంతవేత్తలూ ఉన్నారు. బలప్రయోగాన్ని ప్రధానసాధనంగా భావించినవారిలో లెనిన్, మావోలు, సాంఘిక కృషిని ప్రధాన సాధనంగా ఎంచినవారిలో గ్రాంసీ ఆ పని చేశారు.కానీ మనరాష్ట్రంలోనే కాదు, మన దేశంలో సహితం కమ్యూనిస్టు ప్రయోగానికి ఒక్క కొత్త ఆలోచన అందిచ్చిన సిద్ధాంతవేత్తగానీ నాయకుడుగానీ లేరు. పార్టీ నాయకులే కాదు, యూనివర్సిటీలలోనూ బయటా ఉండే మేధావులలో సహితం, మార్క్సిస్టు సిద్ధాంతాన్ని ఎంతో కొంత సమర్థంగా అన్వయించడం చేతనయిన వారుంటే ఉండవచ్చునుగానీ ఆ సిద్ధాంతానికి ఒక్క కొత్త ఆలోచనయినా చేర్చినవారు ఒక్కరూ లేరు.

మనకు తెలివితేటలేం తక్కువ లేవు కాబట్టి దీనికి కారణాన్ని తెలివితక్కువతనంలో కాక మన దేశ తాత్విక సంప్రదాయంలో వెతుక్కోవాలి. బ్రాహ్మణీయ తాత్విక సంప్రదాయం భాష్యకారుల సంప్రదాయం. 'ఇది నేను చెప్పున్నాను' అని ప్రకటించిన బ్రాహ్మణ పండితుడు ఒక్కడూ లేడు. పరిస్థితులు మారుతూ ఉన్నాయి కాబట్టి ఒకసారి కాకపోతే ఒకసారి కొత్తగా మాట్లాడక వారికి కూడా తప్పలేదుగానీ అప్పుడు కూడా 'నేను వేదానికి భాష్యం చెప్పున్నాను' అని మాత్రమే అన్నారు. స్వంత ఆలోచనకు బ్రాహ్మణీయ సంప్రదాయంలో 'లెజిటిమెసీ' లేదు. అది అన్ని ఉద్యమాలలోకీ ప్రవేశించి సిద్ధాంత నిబద్ధత, క్రమశిక్షణ అనే కొత్తపునాదులను వెతుక్కొని గట్టిగా స్థిరపడింది. సమర్థంగా బలప్రయోగం చేయడంలో పీపుల్స్‌వార్ అభివృద్ధి చేసిన అసాధారణమైన నైపుణ్యమొక్కటి తప్పిస్తే(నూతన సమాజ నిర్మాణానికది ఉపయోగపడుతుందని అనుకుంటే), కమ్యూనిస్టు లక్ష్యసాధన ఏవిధంగా జరగాలన్న విషయంలో సృజనాత్మకమైన చేర్పు ఒక్కటీ మన రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమం చేయలేదు. మన రాష్ట్రమేమిటి, దేశంలోనే చేయలేదు.

దీని అర్థం కమ్యూనిస్టు ఉద్యమం మన రాష్ట్రంలోనయినా, దేశంలోనయినా సాధించింది ఏమీ లేదని కాదు. మన పొరుగు రాష్ట్రాలయిన ఒరిస్సా, మధ్యప్రదేశ్‌లను చూస్తే మన రాష్ట్రంలో కమ్యూనిస్టు ఉద్యమం బలంగా ఉండడంవల్ల ఎంత మేలు జరిగిందో అర్థం అవుతుంది. దోపిడీ, అణచివేత, ప్రతిఘటన, తిరుగుబాటు అనే మాటలు, సమాజాన్ని పాలకవర్గాలు-ప్రజలు అని వర్గీకరించి వీరి భిన్న ప్రయోజనాలను ప్రాతిపదిక చేసుకుని తర్కించే ఆలోచనారీతి మన సాంఘిక నుడికారంలో భాగం అయిపోయాయి. ఈ నుడికారం ఎరుగని ప్రజలను చూసినప్పుడుతప్ప దీని విలువ ఏమిటో అర్థంకాదు. ఆ నుడికారం తెలిసి వుండి కూడా అణచివేతను అధిగమించలేకపోవడం ఒకెత్తయితే, ఆ భావనలతో పరిచయం లేకపోవడం వల్ల ఏదో అసంతృప్తి అనుభవిస్తూ కూడా అది అణచివేత అని గుర్తించలేకపోవడం వేరొక ఎత్తు. ఇప్పుడీ ఆలోచనలు మన రాష్ట్రంలో అన్ని ఉద్యమాల సామాన్య పరిభాషేగానీ, వాటిని మొదట ప్రవేశపెట్టింది, చాలా అణచివేతకు ఓర్చి ప్రజలకు అలవాటు చేసింది కమ్యూనిస్టులే.

భాష తెలీకపోతే ఏమయింది, భావం తెలీదా అనుకోవడం పొరబాటవుతుంది. భాషే సత్యం అన్న 'ఆధునికానంతరవాద' తాత్విక వైఖరిని ఆమోదించనవసరం లేదుగానీ భాష కేవలం అంతకుముందే మనకు 'తెలిసిన' విషయానికొక వ్యక్తీకరణ సాధనం కాదనీ, బాహ్య వాస్తవికతను వ్యక్తం చేయడంలోనే కాక అది మన ఎరుకలోకి రావడంలో కూడా భాషకు కీలకమైన స్థానం ఉందనీ గుర్తించినట్టయితే అణచివేతను అవ్యక్తమైన అసంతృప్తిగా కాక అణచివేతగానే గుర్తించడంలో కమ్యూనిస్టులు ప్రజలకలవరచిన పరిభాషకు చాలా ప్రాముఖ్యం ఉందని కూడా చూడగలుగుతాం. అయితే కమ్యూనిస్టులు నిర్వహించిన పోరాటాలు భౌతిక ఫలితాలు కూడా చాలా ఇచ్చాయి. ఒక్కొక్క గ్రామంలోనూ ఒక్కొక్క కార్ఖానాలోనూ వచ్చిన ఫలితాలను ఏకరువు పెట్టనక్కరలేదుగానీ ప్రభుత్వ పాలనా విధానాలలో వచ్చిన మార్పులను ప్రస్తావించడం అవసరం. భారతదేశంలో భూసంస్కరణలు శాసన రూపం తీసుకోవడానికొక ముఖ్య కారణం కమ్యూనిస్టులు నిర్వహించిన భూమి పోరాటాలు. కాగా, 1970లలో సీలింగ్ చట్టాన్ని సవరించి బాగా తగ్గించడానికి ప్రత్యక్ష కారణం నక్సలైట్ ఉద్యమం. తానే ఇందిరాగాంధీకి సీలింగ్ చట్టాన్ని సవరించమని సలహా ఇచ్చానని పి.వి.నరసింహారావు సగర్వంగా చెప్పుకుంటే చెప్పుకోవచ్చునుగాక, అతనికి ఆ ఆలోచన రావడానికి కారణం నక్సలైట్ ఉద్యమం. మన రాష్ట్రంలోనయితే ఆదివాసీలకు ఎంతో కొంత మేలు చేసిన ఐటిడిఎ,గిరిజన సహకార సంఘాల ఏర్పాటు, '1 ఆఫ్ 70' సవరణ శ్రీకాకుళ పోరాటం పర్యవసానంగా వచ్చినవే. ఇటువంటి ఉదాహరణలు ఇంకా కూడా ఇయ్యవచ్చును.




ప్రజల చైతన్యంమీద, ప్రభుత్వవిధానాల మీద కమ్యూనిస్టులకుండిన ప్రభావం కేవలం వారి భౌతిక బలాన్నిబట్టి ఉండలేదు. దానిని మించి ఒక నైతికబలం కమ్యూనిస్టు ఉద్యమానికి ఉండింది. న్యాయానికి నిలబడతారనీ, అవినీతితో రాజీ పడరనీ, త్యాగానికి వెనుకాడరనీ, నిర్బంధానికి భయపడరనీ ఒక అభిప్రాయం ఉండింది. ఈ రోజు ఆ అభిప్రాయం లేనేలేదని అనలేముగానీ బాగా బలహీనపడింది. అది బలహీనపడినమేరకు కమ్యూనిస్టుల ప్రభావం కూడా బలహీనపడింది.

సిపిఐ కాంగ్రెస్‌తో చెలిమి చేసిననాటి నుండి ఇది మొదలయింది. దానివల్ల భౌతికంగా(అంటే నిర్మాణం పటిష్టతలోనూ, కార్యకర్తల సంఖ్య, నిబద్ధతలలోనూ, ఉద్యమాల బలంలోనూ) సిపిఐ ఏం పొందిందో ఏం కోల్పోయిందోగానీ నైతికమైనగుర్తింపు,గౌరవం చాలా కోల్పోయింది. తరువాతి కాలంలో ఒక దశాబ్దంపైగా సిపిఐ, సిపిఐ(ఎం)లు రెండూ తెలుగుదేశం పార్టీతో కలగలిసి తిరిగినప్పుడు కూడా ఇదే ఫలితం కలిగింది. కమ్యూనిస్టు సిద్ధాంతంలో నైతికతకు ఒక స్పష్టమైన స్థానం లేకపోవడం వల్ల ఈ విషయాన్ని గుర్తించడం సహితం ఆ పార్టీలకు కష్టమయింది. పాలకవర్గాల దిగజారుడుతనాన్ని నిందించడానికీ,ప్రజలను ఆకర్షించడానికీ అక్కరకొచ్చే సాధనంగా తప్ప నైతికతకు కమ్యూనిస్టులు నమ్మే సిద్ధాంత దృక్పథంలో స్వతంత్రమైన స్థానమేమీ లేదు. 'పోరాట అవసరాలు' దానికంటే ఎందుకు ముఖ్యంకాదో చెప్పగల ప్రమాణమేదీ లేదు. అందువల్ల సిపిఐ, సిపిఐ(ఎం)లు తెలుగుదేశంపార్టీతో పొత్తు పెట్టుకోవడమేగాక ఆ పార్టీ అంతర్గతసంక్షోభాలలో ఆ పార్టీ అధినాయకుడిని వెనకేసుకొచ్చి, అతనిని వ్యతిరేకించినవారిని తెలుగుదేశం కార్యకర్తలతో సమానంగా దుయ్యబట్టిన సందర్భాలనేకం ఉన్నాయి. 'ఎన్నికల పొత్తుకు ఇది ఏ విధంగా అవసరం?' అన్న సందేహం సహితం వారికి వచ్చినట్టు కనిపించదు.

1960లలోనే అప్పటికి సిపిఐలో అంకురించిన ఈ లక్షణాల కారణంగానే నక్సలైట్ ఉద్యమం ఆవిర్భావాన్ని రాజకీయంగా ఆహ్వానించిన వాళ్లెందరున్నారో నైతికంగా ఆహ్వానించినవారూ అందరున్నారు. సిపిఐ ఆ తరువాత కాంగ్రెస్‌తో పూర్తిగా కలిసిపోవడం, 1980లలో మన రాష్ట్రంలో సిపిఐ, సిపిఐ(ఎం)లు తెలుగుదేశం పార్టీతో అంతగానూ ఒకటైపోవడం నక్సలైట్ ఉద్యమానికి ఉండే ఈ ఆకర్షణను పెంచింది. 'వాళ్ల సిద్ధాంతాలతో విభేదిస్తానుగానీ వాళ్ల నిజాయితీనీ, విలువలనూ గౌరవిస్తాను' అని 1990దాకా కూడా తెలంగాణలో నక్సలైట్ల గురించి అనేవాళ్లుండేవారు. ఇప్పుడా పరిస్థితి నక్సలైట్ ఉద్యమానికి కూడా బాగా తగ్గింది. దీనికి దృష్టాంతాలూ, తార్కాణాలూ ఏకరవు పెట్టనవసరం లేదు.

ఈ బలాన్ని అన్ని కమ్యూనిస్టు పార్టీలూ తిరిగి పొందడం అవసరం. సిపిఐ, సిపిఐ(ఎం)లు చాలాకాలం తరువాత స్వతంత్రంగా పనిచేస్తున్నాయి. ఇది కేవలం ఒక తాత్కాలికమైన ఎత్తుగడ కాదనీ, సూత్రబద్ధమైన నిర్ణయమనీ ప్రజలను నమ్మించగలిగితే(అదసలు నిజమైతే) వ్యవస్థను విమర్శించే నైతిక అర్హతను తిరిగి పొందగలుగుతాయి. దానివల్ల రాగల బలం అంతా ఇంతా కాదు. నక్సలైట్ పార్టీలు కూడా డబ్బుల సేకరణలో, బలప్రయోగంలో, సమస్యలను ఎదుర్కొనడానికి వేసే ఎత్తుగడలలో, తమ మధ్య ఉన్న అంతర్గత కలహాలను పరిష్కరించుకోవడానికి అనుసరించే విధానాలలో, ప్రజలలో పని చేస్తున్న ఇతర ఉద్యమాలతో వ్యవహరించే పద్ధతిలో కొన్ని ప్రామాణికమైన విలువలను పాటించడం నేర్చుకోవాలి. ఆర్థిక పునర్వ్యవస్థీకరణవల్ల పేద,పీడిత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలలో వారికి అండగా నిలిచే పాత్ర కమ్యూనిస్టులు పోషించాలంటే ఇది కనీసం అవసరం. అంతకుమించి కమ్యూనిస్టు ఉద్యమం తన లక్ష్యమైన సమసమాజంవైపు పురోగమించాలంటే కేవలం ఆచరణకు సంబంధించిన పై మార్పులు సరిపోవు. సిద్ధాంత వివేచన కూడా చాలా అవసరం. కానీ ఈ మధ్యకాలంలో బలంగా చర్చకు వచ్చిన ముఖ్యమైన సైద్ధాంతిక సందేహాలకు సహితం కమ్యూనిస్టు పార్టీలేవీ సంతృప్తికరమైన సమాధానం చెప్పలేకపోయాయి. పార్టీలే కాదు, సిద్ధాంత రంగంలో కృషి చేయడమే తమ ప్రధాన పాత్ర అయిన మేధావులు సహితం చెప్పలేకపోయారు. కులం, జెండర్ అనే రెండిటిని ఉదాహరణగా తీసుకోవచ్చు. వీటిని చారిత్రక భౌతికవాదం ఏవిధంగా వివరిస్తుందనే ప్రశ్నకు తమ సంతృప్తి కోసం ఏదో ఒక జవాబు చెప్పుకోడం తప్ప ఇతరులను-అందరినీ కాకపోయినా ఒకరిద్దరినయినా- ఒప్పించగల వివరణ ఏదీ ఇవ్వలేకపోయారు.

ఈ సిద్ధాంత లోపాన్ని కమ్యూనిస్టు ఉద్యమం ఎప్పటికయినా అధిగమించగలదో లేదో గానీ పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా పేదలకు అండగా నిలబడే పాత్ర ఏదయితే కమ్యూనిస్టు ఉద్యమం సమర్థంగానే నిర్వహించగలదని ఈ శతాబ్దపు చరిత్ర రుజువు చేసిందో ఆ పాత్రను తిరిగి శక్తివంతంగా నిర్వహించడానికి అవసరమైన భౌతిక బలాన్ని, నైతిక సాధికారతనూ అది తిరిగి పొందుతుందని ఆశిద్దాం. రాబోయే రోజులలో అది చాలా అవసరం అవుతుంది.

-కె.బాలగోపాల్